క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): తోటివారికి సాయం చేయడం అలవాటు చేసుకోవాలని లయన్స్ క్లబ్ కృష్ణాజిల్లా 316 డి.గవర్నర్ గద్దే శేషగిరి అన్నారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఫౌండేషన్, సీవీఆర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఫస్ట్ వైస్ గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు సహకారంతో ఆదివారం వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు తమ వంతు బాధ్యతగా నిత్యావసర సరుకుల కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. లయన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హనుమంతరావు, సెక్రటరీ నాగరాజు, పాస్ట్ ప్రెసిడెంట్ నారాయణ, డిస్ట్రిక్ క్యాబినెట్ సభ్యులు భాషా, రషీద్, రీజనల్ చైర్ పర్సన్ డాక్టర్. ఎ.శరాబంధీరావు, క్లబ్ సభ్యులు బి. వెంకన్న, వెంకటేశ్వరరావు, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధన



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నున్న మామిడి తోటల్లో ఆదివారం నిర్వహించిన కార్తిక వనసమారాధన ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. చిన్నారులు, యువతీయువకులు, మహిళలు మ్యూజిక్ చైర్, షటిల్, క్రికెట్, కబడ్డీ, జల్దీఫైవ్, క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి సభ్యులు ప్రదర్శించిన పలు హాస్య నాటికలు అందరినీ కడుపుబ్బ నవ్వించాయి. అనంతరం సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావులు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం రామకృష్ణ దంపతులను సీపీఐ నాయకులు ఆత్మీయంగా సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యాన కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతాలు ఆచరించారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ వ్రతం విశిష్టతను వివరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే ముత్యాలంపాడు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో 250 మంది భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఆచరించారు. దాత జి. కాసులమ్మ సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు, కార్యదర్శి శివరామరాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం సమీపంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. అరటి డొప్పలతో ప్రత్యేకంగా తయారు చేసిన మందిరంలో అయ్యప్ప స్వామిని ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గురుస్వామి అన్నాబత్తుల శరాబంధీరావు స్వామివారికి విశేషంగా పూజలు, అర్చనలు చేసి ప్రత్యేక హారతులు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో స్వాములు, భక్తులు పాల్గొని పూజలు చేశారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు విద్యార్థులు నృత్య నీరాజనాలు అర్పించారు. ఆదివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విశాఖపట్నంకు చెందిన శ్రీనవ్య నాట్య మందిర్‌కు చెందిన 50 మంది చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇన్‌చార్జి డాక్టరే దిక్కు..

- మధురానగర్ యూపీహెచ్‌సీలో అంతంతమాత్రంగా వైద్యసేవలు
- ఏడాదిగా వైద్యాధికారిని నియమించని వైనం



మధురానగర్ యూపీహెచ్‌సీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ యూపీహెచ్‌సీ(అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్)లో గత ఏడాది కాలంగా ఇన్‌చార్జి వైద్యులతోనే సేవలు అందిస్తున్నారు. పేద మధ్యతరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో వైద్యులు లేకపోవడంతో వైద్యసేవలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పని చేస్తున్న వైద్యురాలు ఏడాది క్రితం వేరే ఉద్యోగం నిమిత్తం వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇక్కడ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. డాక్టర్ పోస్టును భర్తీ చేయాల్సిన అధికారులు పక్కనే ఉన్న యూపీహెచ్‌సీ వైద్యులను ఇన్‌చార్జిగా నియమించారు. ఇన్‌చార్జి వైద్యులు వారు పనిచేసే ఆరోగ్యకేంద్రంతో పాటు ఇక్కడ కూడా వైద్యసేవలు అందించాల్సి రావడంతో మధురానగర్ యూపీహెచ్‌సీకి సక్రమంగా హాజరుకావడం లేదు. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. ఇన్‌చార్జి వైద్యులు సక్రమంగా రాకపోవడంతో రోగులకు అరకొర వైద్యసేవలు అందిస్తున్నారు. యూపీహెచ్‌సీకి వచ్చే రోగులకు సిబ్బంది పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చి పంపిస్తున్నారు. వైరల్ జ్వరాలు వచ్చినప్పుడు వైద్యులు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలను ఖర్చు చేయాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా ఉన్నతాధికారులు కొత్త డాక్టర్‌ను నియమించారని సోమవారం నుంచి విధులకు హాజరవుతారని ఆరోగ్యకేంద్రం సిబ్బంది చెబుతున్నారు.

ఏడాదిగా వైద్యాధికారి లేరు



వైద్య సేవల కోసం వచ్చిన వారికి ఇక్కడి సిబ్బంది మందులు ఇచ్చి పంపించి వేస్తున్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత ఆ రిపోర్టులు ఎలా ఉన్నాయో కూడా తెలియడం లేదు. డాక్టర్ పరీక్షించి మందులు ఇస్తే సంతృప్తికరంగా ఉంటుంది. ఏడాది కాలంగా ఇక్కడ వైద్యాధికారి లేరు.

– రాజు, మధురానగర్

అవసరమైన మందులు లేవు



ఇక్కడ ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి లేకపోవడంతో పెద్దాసుపత్రికి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుంటున్నాను. వయోవృద్ధులు వైద్యపరీక్షల కోసం అంత దూరం వెళ్లడం ఇబ్బందిగా ఉంది. అలాగే ఇక్కడ అన్ని ఆరోగ్య సమస్యలకు అవసరమైన మందులు ఉండటం లేదు.

– పెదర్ల నాగేశ్వరరావు, నేతాజీకాలనీ

తక్షణమే డాక్టర్‌ను నియమించాలి



ఇక్కడ ఏడాది కాలంగా వైద్యులు లేకపోవడంతో వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. రక్త పరీక్షల కోసం ఇబ్బందులు పడాల్సివస్తోంది. అలాగే ఇక్కడ థైరాయిడ్, టైఫాయిడ్ వంటి పరీక్షలు నిర్వహించడం లేదు. అధికారులు స్పందించి తక్షణమే వైద్యాధికారిని నియమించాలి.

– ఎస్‌పీ శ్రీనివాస యాదవ్, మధురానగర్

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో స్పా కళాశాల డైరెక్టర్ శ్రీకొండ రమేష్, అనంత పద్మశేఖర్, పి.రమేష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): చిన్నారుల మనసులోని భావాలను బహిర్గతం చేయడానికి చిత్రలేఖనం ఎంతగానో దోహదం చేస్తోందని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా) కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీకొండ రమేష్ చెప్పారు. అనంత్ డైమండ్స్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల సంయుక్తంగా బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 13న స్పా కళాశాల ఆవరణలో జరిగిన డ్రాయింగ్ పోటీల్లోని విజేతలకు స్పా కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో బహుమతులను ఆదివారం అందజేశారు.

ప్రతి ఏటా పోటీల నిర్వహణ..

రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేసి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో డ్రాయింగ్ గీసే వారికి (ఆర్టిస్టులకు) మంచి డిమాండ్ ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు డ్రాయింగ్‌లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. అనంత్ డైమండ్స్ అధినేత అనంత పద్మశేఖర్ మాట్లాడుతూ పిల్లలు డ్రాయింగ్ గీయడానికి ఇచ్చిన అంశాలను తగినట్లుగా ఎంతో చక్కగా బొమ్మలను గీశారని చెప్పారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకుడు పి.రమేష్ మాట్లాడుతూ డ్రాయింగ్‌పై చిన్నారుల్లో ఆసక్తిని కలిగించడానికి ఈ పోటీలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు గుంటూరు జిల్లా నుంచి అధిక సంఖ్యలో చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. స్పా కళాశాల రిజిస్ట్రార్ కేవీ ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.వెంకట కృష్ణకుమార్, సంతోష్‌కుమార్, టి.మాధవరావు, చిత్రకారులు జి.జయన్న, కళాసాగర్ పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. సభ అనంతరం స్పా కళాశాల డైరెక్టర్ రమేష్‌ను సత్కరించారు. అధిక సంఖ్యలో చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీలో విజేతలకు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రత్యేక చిన్నారులను ఆదరించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టీ కృష్ణకుమారి అన్నారు. అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్ చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ 18వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక చిన్నారులను ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, ప్రత్యేక చిన్నారులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

శరీర దారుఢ్యానికి 'కరాటే' అవసరం

సినీ నటుడు సుమన్



మార్షల్ ఆర్ట్స్ చిన్నారులతో సినీ నటుడు సుమన్, నిర్వాహకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'కరాటే' శరీర దారుఢ్యానికి.. మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమని తెలుగు సినీనటుడు, వైఎంకే అకాడమీ చైర్మన్ సుమన్ పేర్కొన్నారు. వైఎంకే అకాడమీ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను సింగ్‌నగర్‌లోని గుజ్జల సరళాదేవీ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే, కుంగ్ ఫూ, తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, బెల్ట్స్‌లను ముఖ్యఅతిథిగా విచ్చేసిన నటుడు సుమన్ చేతుల మీదుగా అందజేశారు. సుమన్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ అనేది గొప్ప మర్మ కళ అని, ప్రస్తుత సమాజంలో ఇది చాలా అవసరమన్నారు. తనను తాను రక్షించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. చిన్నారుల్లో వీటిపై అవగాహన కల్పించేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైఎంకే అకాడమీ టీమ్ జి. రూఫాస్ పాల్, డి. శ్రీనివాస్, జి. ప్రకాష్‌రావు, సభ్యులను ఆయన అభినందించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్కిట్ ప్రాక్టీస్‌లో చిన్నారులు



ప్రదర్శనలు వీక్షిస్తున్న చిన్నారులు, తల్లిదండ్రులు

అదిరింది.. బాలల సంబరం

సిద్ధార్థ ఆడిటోరియంలో 7వ అమరావతి బాలోత్సవం(పిల్లల పండుగ) ఆదివారంతో ముగిసింది. బాలోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. రెండు రోజులుగా వివిధ అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేసి, అభినందించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వివిధ జాతీయ నేతల వేషధారణలో చిన్నారులు



మానవ శరీరం పనితీరును వివరిస్తున్న దృశ్యం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వరదల పేరుతో వడ్డనకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరదల పేరుతో ప్రజలపై కూటమి ప్రభుత్వం వడ్డనకు సిద్ధమైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర జీఎస్టీపై ఒక శాతం అదనంగా సర్‌ఛార్జీని విధించేందుకు వెసులుబాటు కల్పించాలని సీఎం చంద్రబాబునాయుడు కేంద్రాన్ని కోరటాన్ని ఆయన తప్పుబట్టారు. కేంద్రం నుంచి రావలసిన నిధులు రాబట్టడంలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలమయ్యిందని విమర్శించారు. ప్రజలపై అదనపు భారం మోపడం సరైన విధానం కాదన్నారు. దాతలు సాయంగా అందించిన వందల కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. పైగా అప్పుల్లో ఉన్న రాష్ట్రానికి సాయం అందించమని కేంద్రాన్ని కోరవలసిందిపోయి.. పన్ను వేసేందుకు సహకరించమని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. మిమ్మల్ని ఆదుకునేందుకు మీపైనే పన్ను వేయబోతున్నామని వరద బాధితులకు చెప్పడం దేశంలోనే తొలిసారి చూస్తున్నామన్నారు. అసలు కేంద్ర బృందాలు అంచనా వేసిన వరద నష్టమెంత..? రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అందించిన సాయమెంత.? విరాళాల రూపంలో దాతలు అందించిన మొత్తం.. కేంద్రం ప్రకటించిన సాయంపై సవివరంగా ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఈ సందర్భంగా మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలు, కరెంట్ ఛార్జీలతో సామాన్యుడి జీవితం భారంగా మారిపోయిందని మండిపడ్డారు. మరోసారి వడ్డనకు సిద్ధమైతే ప్రజలు ఈ రాష్ట్రంలో ఎక్కడా బతికే పరిస్థితి ఉండదని దుయ్యబట్టారు. కనుక రాష్ట్ర జీఎస్టీపై అదనపు సర్ ఛార్జీ విధింపు ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మల్లాది విష్ణు హెచ్చరించారు.

అంతరంగ వీక్షణం పుస్తకావిష్కరణ



అంతరంగ వీక్షణం పుస్తకావిష్కరణ సభలో అన్నవరపు బ్రహ్మయ్య, విల్సన్‌రావు తదితరులు

విజయవాడ కల్చరల్: మానవస్పర్శకు సజీవ రూపమివ్వడమే అసలైన సాహిత్యమని సీనియర్ జర్నలిస్ట్ అన్నవరపు బ్రహ్మయ్య అన్నారు. మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్ రచించిన అంతరంగ వీక్షణం పుస్తక ఆవిష్కరణ (ముఖాముఖీ సంకలనం) కార్యక్రమం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం బందరురోడ్డులోని ఠాగూరు గ్రంథాలయంలో నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన బ్రహ్మయ్య మాట్లాడుతూ విల్సన్ సామాజిక స్పృహ తెలిసిన రచయిత అని అభివర్ణించారు. సాహితీ సృజన చేయడం అందరికీ సాధ్యం కాదని అందులోనూ లబ్ధప్రతిష్టులైన వారిని ఇంటర్వ్యూ చేయాలంటే వారి గురించి సమగ్రమైన విచారణ చేయాలని వారి అంతరంగంలోకి తొంగి చూడాల్సిన అవసముందన్నారు. ఇది రెండు మూడు తరాల సాహితీవేత్తల వృత్తిని, ప్రవృత్తిని రికార్డ్ చేసిన గ్రంథమని కొనియాడారు. సాహిత్య ప్రస్థానం సంపాదకుడు సత్యాజీ మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా గొప్ప గొప్ప సాహితీవేత్తల జీవన నేపథ్యం, వారి ప్రస్థానం తెలుసుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుంకర గోపాల్, బండ్ల మాధవరావు, మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ, మల్లెతీగ సాహిత్యవేదిక సభ్యుడు చొప్పా రాఘవేంద్ర శేఖర్ పాల్గొన్నారు.

పేద ముస్లింలకు అండగా ఆజాద్ ముస్లిం కమిటీ



దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేస్తున్న నాగుల్‌మీరా, సభ్యులు

పాయకాపురం(విజయవాడరూరల్): పేద ముస్లింలకు ఆజాద్ ముస్లిం కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా తెలిపారు. కండ్రికలో ఆదివారం బిస్మిల్లా ఎస్ఎస్ చికెన్ సెంటర్ వద్ద వైఎస్సార్ కాలనీకి చెందిన పేద ముస్లిం షేక్ రహీం అనే దివ్యాంగునికి షేక్ నాగుల్ మీరా ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింలకు గత 34 నెలలుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. సేవాభావం కలిగిన వారిని కమిటీలో చేర్చుకుని సభ్యత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, అధికార ప్రతినిధి ఎస్‌డీ మౌలాలి, సభ్యులు అబ్దుల్ రహీం, విజయవాడ నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలీ, 61,64వ డివిజన్ల కార్యదర్శులు షేక్ సలాం, ఎండీ రఫీ, వైఎస్సార్ కాలనీ నాయకుడు కాలేషా, కమిటీ యూత్ నాయకులు ఇబ్రహీం, చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా.?



వీవీ నరసరాజు రోడ్డులో మట్టి దిబ్బలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డులో మురుగుకాలువ పనుల్లో భాగంగా తవ్విన గోతులను సరిచేయలేదు. కాలువ పనులు పూర్తి అయినా తవ్విన మట్టిని రోడ్డుకు అడ్డంగా వదిలివేశారు. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చిన వాహనచోదకులు ఒక్కసారిగా ఇక్కడ రోడ్డు బ్లాక్ కావడంతో వెనక్కు వెళ్లి చుట్టూతిరిగి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. పనులు పూర్తయిన దృష్ట్యా రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డుపై వేసిన మట్టి, వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

'వయోవృద్ధ ట్రస్ట్' సేవలు అద్వితీయం



నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ విజయ్ శేఖర్, దాత ప్రకాష్ చంద్‌జైన్, ట్రస్ట్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధులకు ప్రతి నెలా ఉచితంగా నిత్యావసర సరుకులు అందజేస్తున్న వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అద్వితీయం అని గుంటూరు మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కోలా విజయశేఖర్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యాన దాత సంగీత ఏజన్సీస్ అధినేత ప్రకాష్ చంద్‌జైన్ సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయశేఖర్ మాట్లాడుతూ ఎవరూ పట్టించుకోని వయోవృద్ధులకు అండగా నిలుస్తున్న ట్రస్ట్ సభ్యులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్‌చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ తాము అందిస్తున్న సేవలకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వృద్ధులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో తట్టి అర్జునరావు, ఎస్ఎన్ వరప్రసాద్, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.